ఉద్యాన సాగులో జాగ్రత్తలు అవసరం

- పంటలో ఉన్న వర్షం, వరద నీరు బయటకు పంపాలి
- అధికారుల సూచనలు పాటించాలి

కొల్లిపర: కృష్ణా నది దిగువన లంక భూమిలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు వరద నీరు , వర్షం నీరు పంటలలో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి ఉద్యాన విస్తరణ అధికారి పి.శ్రీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన పంటను కాపాడుకునే విషయమై పలు సూచనలు చేశారు. కొల్లిపర మండలాల్లో 2500 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, వర్షాలు వరదలు కారణంగా అరటి, పసుపు, కంద, కూరగాయలు పంటలు బాగా నీటిలో నానిన విషయాన్ని గమనించానన్నారు. అయితే దిగుబడి నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు పాటిస్తే మంచిదని ఆయన సూచించారు.

ఇలా చేయాలి

- పంటలలో నిలువ ఉన్న అదనపు నీటిని బయటకు పంపివేయాలి
- మొక్కలు బలంగా పెరగడానికి పోషకాల మోతాదులు పెంచాలి
- వ్యాధికారక శిలీంధ్రాలను, చీడలను నివారించడానికి తగిన చర్యలను చేపట్టాలి.

అరటిలో జాగ్రత్తలు ఇలా

- ఈదురు గాలులకు విరిగిపోయిన అరటి తోటలలో గెలలు ఉన్నట్లయితే వాటిని కోసి మార్కెట్ చేసుకోవాలి.
- లేత అరటి తోటలు (5-7 నెలల వయస్సు) విరిగి పోయినట్లయితే అలాంటి తోటలను శుభ్రం చేసి కొత్త పిలకలను వదులుకోవాలి. వదలిన పిలకలకు ప్రతీ 25 రోజులకు ఒక సారి మొక్క ఒక్కింటికీ 100 గ్రాములు యూరియా మరియు 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ వేయాలి


వరదలు తగ్గిన తరువాత వరద నీరు బయట పంపిన అనంతరం దెబ్బతిన్న పసుపు పంట

- 2 లేక 3 నెలల వయస్సు ఉన్న అరటి మొక్కలు విరిగిపోతే, విరిగినచోట కోసివేసి మరలా ఆ మొక్కలను పెంచవచ్చు. అరటి దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా లీటరు నీటరు నీటికి కలిపి లేదా బోర్డో మిశ్రమం 1శాతం దుంప చుట్టూ తడిచేటట్లుగా నేలలో పోయాలి.

పసుపు పంటలో జాగ్రత్తలు

- ముందుగా వర్షం నీరు బయటకు పూర్తిగా పంపించి వేయాలి
- వర్షాలు ఆగిన వెంటనే పంటపై లీటరు నీటికి 5గ్రా, పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి.
- పంటలో ఇనుప ధాతులోపం ఏర్పడి లేత ఆకులు పాలిపోయినట్లు కనపడితే, 10 లీటర్ల నీటిలో 50 గ్రా, చొప్పున అన్నభేది ఒక నిమ్మ చెక్క రసం, జిగురు మందుతో కలిపి 15రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- నేల అదునుకు వచ్చిన వెంటనే అంతర కృషి చేసినట్లైతే త్వరగా ఆరుతుంది. పై పాటుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 40 కిలోల పొటాష్ తో పాటు 200 కిలోల వేపపిండి వేయాలి.


గ్రామాల్లో మెట్ట ప్రాంతంలో వర్షాల కారణంగా పసుపు పంటలో నిలిచిన వర్షం నీరు

నీరు నిల్వ లేకుండా చూడాలి



రెండు, మూడు రోజుల పాటు సాధారణ స్థాయి కన్న ఎక్కువ శాతం వర్షం పడిన సమయంలో అరటి, పసుపు వంటి పంటలో వర్షం తగ్గిన వెంటనే నీరు నిల్వ లేకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అనంతరం వ్యవసాయాధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపిన విధంగా తగుచర్యలు తీసుకోవాలి. అప్పుడే పంటకు ఎటువంటి నష్టం జరగకుండా ఉంటుంది.

పి.శ్రీధర్‌రెడ్డి, ఉద్యాన విస్తరణ అధికారి

మురుగు నీటిలోనే జీవనం!


ఇళ్ల చుట్టూ చేరిన మురుగు నీరు

కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అంగలకుదురు గ్రామ శివారు ప్రాంతాలు మురుగు నీటితో నిండిపోయాయి. దీంతో 10 రోజులుగా కాలనీ వాసులు నీళ్లలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అంగలకుదురు నుంచి చుండూరు మండలం దుండిపాలెం వెళ్లే మార్గంలో పడమరవైపున కొన్ని పరిశ్రమలు, రైస్ మిల్లు, సుమారు 100 ఇళ్లు ఉన్నాయి. ఈ ప్రాంతానికి తూర్పు వైపున టీఎస్ చానల్ ప్రవహిస్తోంది. ప్రస్తుతం కాల్వలు పూర్తి సామర్థ్యంతో నీటితో నిండి ప్రవహిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతం మురుగు నీటితో నిండిపోయింది. పల్లపు ప్రాంతం కావడంతో


మురుగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

వర్షపు నీరు కాల్వలోకి వెళ్లే పరిస్థితి లేదు. 10 రోజులుగా ఇబ్బందులు పడుతున్నా తమను పట్టించుకున్న నాథుడే లేడని కాలనీ వాసులు వాపోతున్నారు. నీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -తెనాలిరూరల్

క్లుప్తంగా

పంట నష్టం నమోదుకు నేటితో ఆఖరు



తెనాలి: అధికవర్షాలు, వరదలతో జరిగిన పంట నష్టం తాలూకు ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) చెల్లింపునకు రైతు సేవా కేంద్రం సిబ్బంది పంట పొలాలను సందర్శించి రైతుల జాబితాలను తయారుచేస్తున్నారని వ్యవసాయశాఖ, తెనాలి ఏడీఏ ఉషారాణి వెల్లడించారు. సోమవారం ఆమె తెనాలి రూరల్ మండలంలోని గ్రామాలను సందర్శించారు. రైతులతో సమావేశమయ్యారు. పంట నష్టం ఎన్యూమరేషన్‌ను పరిశీలించారు. పంట నష్టం నమోదుకు 10వ తేదీ చివరి గడువుగా తెలిపారు. అనంతరం సంబంధిత రైతుల జాబితాలను 11వ తేదీ నుంచి సామాజిక తనిఖీ నిమిత్తం గ్రామాల్లో ప్రదర్శిస్తారని చెప్పారు. పెట్టుబడి రాయితీ పొందటానికి ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చెప్పారు. అందుచేత రైతు సోదరులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రం సిబ్బంది సంప్రదించి, నష్టపోయిన పంట వివరాలు, ఆధార్, బ్యాంక్ ఖాతాను నమోదు చేయించుకోవాలని కోరారు.

సీఎం సహాయనిధికి వితరణ



తెనాలి: వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.1.15 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. సంబంధిత చెక్కును సోమవారం సాయంత్రం తెనాలిలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తా వెంకటరత్నం, కడియా రవిబాబు, సభ్యులు రత్తయ్య, డాక్టర్ రవీంద్రనాధ్, బొబ్బా వెంకటేశ్వరరావు, పాలడుగు ఆనందయ్య, అశోక్, కొల్లి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, కార్యవర్గాన్ని, సభ్యులను మంత్రి మనోహర్ అభినందించారు.

సర్వజ్ఞ సింధుకు సన్మానం



తెనాలిఅర్బన్: విద్యలో రాణిస్తూ పలు అవార్డులను సొంతం చేసుకుంటున్న చినరావూరు వాసి దివి సర్వజ్ఞ సింధు రానున్న రోజుల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలని పండిత దీవి రాంబాబు స్మారక ట్రస్ట్ సభ్యులు ఆకాంక్షించారు. తెనాలిలో ఆదివారం రాత్రి సింధును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటెక్ బయోటెక్నాలజీలో 92 శాతం మార్కులతో బంగారు పతకం సాధించిందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్వహించిన పీజీ సెట్‌లో 8,9 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసమూర్తి, శ్రీనివాసకుమార్, టి.అనంతాచార్యులు, రామలింగేశ్వరరావు, రాధాకృష్ణమాచార్యులు, మాదవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు నమోదు చేసుకోండి

కొల్లిపర: అధిక వర్షాలు, వరదలు కారణంగా పంటలు నష్టం జరిగిన రైతులు ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి పంట నష్టం జరిగిన పంటలను చూపించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు తెలిపారు. వరదలు, వర్షాలు కారణంగా దెబ్బతిన్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం నమోదు చేసే సమయంలో రైతులు తమ వెంట ఆధార్, భూమి పాస్‌బుక్, బ్యాంక్ ఎకౌంట్ బుక్, కౌలు రైతులు కౌలు కార్డులు తమ వెంట ఉంచుకొన్ని సేవా కేంద్రం సిబ్బందికి తమ పంటలను చూపించి పంటలు ఏ మేరకు నష్టం జరిగింది అన్న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వం అందించే నష్ట పరిహారం అందుతుందని తెలిపారు. నమోదు విషయంలో సమయాన్ని పాటించి అధికారులకు సహకరించాలని కోరారు.


సోమలరాజు ఫౌండేషన్ అవార్డుకు ఆళ్ల

14న బెంగళూరులో ప్రదానం



తెనాలి: బెంగళూరులో ఈనెల 14న జరగనున్న సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవంలో వివిధ రంగాల్లోని ప్రతిభావంతులకు ఇస్తున్న అవార్డుల్లో తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఆరోజు వేడుకల్లో ఆయన్ను 'భారత సేవారత్న' పురస్కారంతో సత్కరించనున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివరాజు సమాచారం పంపారు. వృత్తిపరంగా ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు, నాలుగు దశాబ్దాలుగా సాహితీ రచనలు చేస్తున్నారు.

జై జై గణేశా... జై కొడతా గణేశా!


30వ వార్డు కేఎస్ఎం స్కూలు వద్ద గణేష్ మందిరంలో వినాయకుడు


పట్టణ 26వ వార్డులో మందిరంలో గణనాథుడు


నందులపేటలో పూజలందుకున్న గణపతి విగ్రహం


భాస్కరరావుపేటలో 15 అడుగుల గణపతి విగ్రహం


8వ వార్డులో విఘ్నేశ్వరునికి పూజలు చేస్తున్న చిన్నారులు

తెనాలి: గణపతి బొప్పా మోరియా...జై జై గణేశా... అంటూ వినాయకచవితి పర్వదిన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక విజయవాడ రోడ్డులోని 59.5 అడుగుల గణపతి విగ్రహం వద్ద మూడోరోజైన సోమవారం పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తూ వినాయకుడి మందిరాలు ఉత్సవ సంరంభంలో కనువిందు చేస్తున్నాయి.

- పట్టణ భాస్కరరావు పేటలోని గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన గణేష్ మందిరంలో 15 అడుగుల నాగుపాముపై నాట్యమాడుతున్న గణపతి విగ్రహాన్ని పలువురు భక్తులు సందర్శించుకున్నారు. శిల్పాల శ్రీనివాసు, వల్లెం మురళి ఆధ్వర్యంలో ఇక్కడ వేడుకలు జరుగుతున్నాయి.
- నందులపేటలో 18 అడుగుల బాల్‌పూర్ గణపతి విగ్రహానికి గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్నారు. నందులపేటలోనే విఘ్నరాజ యూత్ ఆధ్వర్యంలో గణేష్ మహరాజ్ ఉత్సవాలను పాలడుగు ప్రణీత్, వట్టికూటి లక్ష్మణ్‌చే ఘనంగా జరుగుతున్నాయి.
- బాలగణేష్ ఉత్సవ కమిటీచే పంచముఖ వినాయక విగ్రహం వద్ద నవరాత్రి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.
- మార్కెట్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో 21వ మహా గణపతి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. 13వ తేదీ 11 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు శంకర్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.
- పట్టణ నాజరుపేటలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి అలయం వద్ద గణేష్ మందిరంలో చవితి ఉత్సవాలు జరుగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.
- పట్టణ పూలే కాలనీలో ఉత్సవ కమిటీచే ప్రథమ ఏకదంతాయ వినాయక చవితి మహోత్సవాలు గత మూడు రోజులుగా జరుగుతున్నాయి. అతిథులుగా హాజరైన మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, హరిదాసు గౌరీ శంకర్, మట్టుపల్లి గోపాలకృష్ణ, బండారు రవికాంత్ అన్నదాన వితరణను ప్రారంభించారు. టి ఈశ్వర్, ఎన్ నాగేశ్వరరావు, వెంకటాద్రి, సాంబశివరావు,పఠాన్ పర్యవేక్షించారు.
- గంగానమ్మపేటలో శ్రీసిద్ధి వినాయక ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో దశమ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఉదయం గణపతి, లక్ష్మీ గణపతి, నవగ్రహ, రుద్ర, మన్యుసూక్త హోమాలు జరిపారు. సాయంత్రం మహిళలచే కుంకుమార్చన చేశారు.
- అమరావతి కాలనీలోని చావాస్ గ్రాండ్ ఫంక్షన్ హాలు వద్ద శివ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వరుసగా ఆరో గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి నృత్యగురువు చల్లా యామిని శిష్యబృందం పలు నృత్యాంశాలను ప్రదర్శించింది. సోమవారం అన్నప్రసాద వితరణ చేశారు. బి.సాంబయ్య, నల్లపోతుల శ్రీనివాసరావు, స్టాలిన్ రవి, మారెళ్లపల్లి సాయి, సనకా గోపి, నల్లబోతుల అంకినీడు, దర్శి ఆనంద్, గోరంట్ల తిరుమల తదితరులు పాల్గొన్నారు.
- రూరల్ మండల గ్రామం సోమసుందరపాలెంలో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పి.శివయ్య, ఎం.త్రినాథ్, కె.ప్రణీత్, నాని, నరేంద్ర, ఎం .మల్లికార్జునరావు, కేసన కోటేశ్వరరావు, జొన్నా కోటేశ్వరరావు, వాక శ్రీనివాసరావు, అర్జునరావు పాల్గొన్నారు.


తెనాలి పాత శివాలయం ఎదుట గల గణేష్ మందిరంలో కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్నాయి. మందిరంలో ఉంచిన మిఠాయితో తయారుచేసిన కాశీ విశ్వేశ్వర స్వామిని భక్తులు ఆసక్తిగా తిలకించారు. -తెనాలి


జగ్గడిగుంటపాలెంలో సోమవారం స్వామివారిని దర్శించుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్


పట్టణ 3వ వార్డులో గణేష్ ఉత్సవాల్లో అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

గణేష్ మందిరాలను దర్శించుకున్న ఆలపాటి రాజా

- మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం పట్టణ, పరిసరాల్లోని పలు వినాయక చవితి మందిరాలను సందర్శించారు. స్థానిక విజయవాడ రోడ్డులోని భారీ గణపతిని దర్శించుకున్నారు. నిర్వాహకుల్లో ఒకరైన అమిరినేని రాజా స్వాగతం పలికారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, మాసీ ఎంపీపీ కేసన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- చెంచుపేటలోని 27 వ వార్డులో క్రేజీబాయ్స్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ మహోత్సవం, 29 వ వార్డు, భాస్కరరావుపేట, నందులపేటలో జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాలను, రూరల్ మండల గ్రామాల్లోని మందిరాలను మాజీ మంత్రి ఆలపాటి సందర్శించారు.

భక్తులకు అన్నదానం.

తెనాలిఅర్బన్: వినాయక చవితిని వేడుకలను శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో 18వ వార్డు ఇస్లాంపేటలోని కృష్ణ బలిజ కమ్యూనిటీ హాల్ నందు సోమవారం విఘ్నేశ్వరుని ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 600 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోలా జగదీష్, అన్నం వాసు, శేఖర్, గంజి సాయి, దుర్గారావు, రామారావు, ఫణీ, కౌసిక్, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు వినూత్న ఎంపిక



తెనాలిఅర్బన్: ఖేలో ఇండియా ఉమెన్ తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు తెనాలి యూనిక్ తైక్వాండో అకాడమీ విద్యార్థిని ఎ.వినూత్న ఎంపికైనట్లు కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. తమిళనాడులో ఈ నెల 11 నుంచి 14 వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటున్నట్లు చెప్పారు. సోమవారం కోచ్ ఆవరణలో ఆమెను అందె బాలచంద్రమౌళి, క్రీడాకారులు అభినందించారు.

నేడు డాక్టర్ నాయుడమ్మ అవార్డు ప్రదానోత్సవం



తెనాలి: ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవం ఆయన జయంతి రోజైన మంగళవారం తెనాలిలో జరగనుంది. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం నాలుగు గంటలకు కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏర్పాటయ్యే ప్రత్యేక సభకు ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపాటి రఘునాధబాబు అధ్యక్షత వహిస్తారు. నైవేలీలోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్న కుమార్‌కు ఈ స్మారక అవార్డు-2024ను రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదుగా బహూకరిస్తారు. చెన్నైలోని సీఎల్ఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణ వి.కాంత్ విశిష్ట అతిథిగా హాజరవుతారు. నాయుడమ్మపై జరిపిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు అవార్డు ప్రదానోత్సవ సభలో నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తారు. గతంలో యలవర్తి నాయుడమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో 23 ఏళ్లపాటు ఏటా జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతివహించిన శాస్త్రవేత్తలకు నాయుడమ్మ అవార్డును ప్రదానం చేసిన ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి.విష్ణుమూర్తి పేరిట సభావేదికకు నామకరణం చేశారు. ఫౌండేషన్ వైస్‌ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ఇతర సభ్యులు పర్యవేక్షిస్తారు.

వెంకట్రామయ్య సేవలు మరవరానివి



తెనాలిఅర్బన్: ఆలపాటి వెంకట్రామయ్య తెనాలి ప్రాంత అభివృద్ధికి చేసిన కృషి మరువరానిదని పలువురు నాయకులు కొనియాడారు. మాజీమంత్రి వెంకట్రామయ్య జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రిగా ఆయన సేవలు అందించారని గుర్తు చేశారు. పట్టణంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరవరానిదన్నారు. ఆయన కుమార్తె దొడ్డపనేని ఇందిర, మనుమరాలు డాక్టర్ గోగినేని ఉమలు ఎమ్మెల్యేలుగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, కొడాలి శ్రీనివాసరావు, వుయ్యూరు రాజశేఖర్‌రెడ్డి, కోటేశ్వరరావు, ఆలపాటి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహారం

తెనాలిరూరల్: కృష్ణా నది వరద బాధితులకు తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలోని సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి సభ్యులు ఆహారాన్ని అందజేశారు. కొల్లిపర మండలం పాత బొమ్మువానిపాలెంకు చెందిన సుమారు 400 మత్స్యకార కుటుంబాలు వేటకు వెళ్లలేని స్థితిలో ఆహారం దొరికే పరిస్థితులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి సభ్యులు సోమవారం గ్రామానికి వెళ్లి అక్కడి మత్స్యకార కుటుంబాలకు ఆహారాన్ని అందజేశారు. సమితి సభ్యులు పర్యవేక్షించారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుతోటకు చెందిన గాజుల అలేఖ్య తనను భర్త వెంకటనాగచిరంజీవి కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది.